# డాటా.. డబ్బుల మూట

- భవిష్యత్తు వ్యాపారమంతా పర్సనల్ డాటా చుట్టూతే
- భూములు, గోల్డ్ కంటే డాటానే విలువైంది: పిచాయ్
- 'అభయహస్తం'తో బజారున పడ్డ పౌరుల సమాచారం
- దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి సైబర్ నేరగాళ్ల కుట్రలు
- సాధారణంగా ఒక ఫోన్ నంబర్‌కు పాతిక ఇస్తామంటున్న కన్సల్టెన్సీ సంస్థలు.. గట్లైతే మన డాటా విలువ రూ.31 కోట్లు
- అంతర్జాతీయంగా 'అభయహస్తం' డాటా విలువ 10 వేల కోట్లు


ఇటీవల హైదరాబాద్ బాలానగర్ ఫ్లైఓవర్‌పై దొరికిన అభయహస్తం దరఖాస్తులు(ఫైల్)

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): విశాల్ హీరోగా వచ్చిన 'అభిమన్యుడు' సినిమా చూశారా? వ్యక్తిగత సమాచారంతో సైబర్ నేరగాళ్లు సామాన్యులను ఆర్థికంగా ఎలా దెబ్బతీస్తారన్న విషయాన్ని చిత్రంలో చూసి సగటు ప్రేక్షకుడు నిశ్చేష్టుడయ్యాడు. ఇప్పుడు తెలంగాణ ప్రజానీకం పరిస్థితి కూడా అలాగే తయారైంది. 6 గ్యారెంటీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'అభయహస్తం' ద్వారా అప్లికేషన్లు పెట్టుకొంటే, ఆ ఫారాలు రోడ్లమీద, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఎక్కడపడితే అక్కడ కనిపించాయి. దీంతో దరఖాస్తుదారులు భయాందోళనలకు గురవుతున్నారు. దరఖాస్తుల్లో పేర్కొన్న తమ పేరు, ఇంటి అడ్రస్, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, కుటుంబ వివరాలు, గ్యాస్, కరెంటు మీటర్ నంబర్లు ఇలా దాదాపు అన్ని వివరాలు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నడిపించేది డాటానే

భవిష్యత్తు వ్యాపారమంతా పర్సనల్ డాటా (వ్యక్తిగత సమాచారం) చుట్టూతే తిరుగుతుందని, రానున్న రోజుల్లో భూములు, బంగారం కంటే డాటానే ఎంతో విలువైనదిగా మారబోతున్నదని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. దీన్ని రుజువు చేస్తూ బ్యాంకింగ్, సెక్యూరిటీస్, మీడియా, ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్, ఫార్మా, ఎంటర్‌టైన్‌మెంట్, ఇన్సూరెన్స్, లోన్స్, ట్రావెల్, గవర్నమెంట్, రిటైల్, హాస్పిటాలిటీ, ఈ-కామర్స్ ఇలా ప్రతి రంగంలో పర్సనల్ డాటా వినియోగం నిత్యకృత్యంగా మారింది. ఇంతటి కీలకమైన వ్యక్తిగత సమాచారం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో అంగడి సరుకుగా మారిపోయింది. మొన్న బాలానగర్ రోడ్ల మీద 'అభయహస్తం' దరఖాస్తులు కనబడితే, నిన్న ప్రైవేటు వ్యక్తుల ఇండ్లలో ప్రత్యక్షమయ్యాయి. ఇప్పటికే 'అభయహస్తం' సమాచారం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి చేరినట్టు అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీన్ని ధ్రువపరుస్తూ మొన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అశ్వారావుపేటకు చెందిన పలువురు దరఖాస్తుదారులకు ఫోన్లు చేసిన సైబర్ నేరగాళ్లు 'అభయహస్తం' గ్యారెంటీలకు ఎంపికయ్యారు.. ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలం'టూ ఒత్తిడి తెచ్చారు. తాజాగా నిజామాబాద్‌లోనూ సైబర్ నేరగాళ్లు తమ పంజాను విసిరారు. దీంతో తమ వ్యక్తిగత డాటా లీకేజీపై తెలంగాణ ప్రజలు భయపడుతున్నారు. కాగా, సాధారణంగా ఒక వ్యక్తి ఫోన్ నంబర్, ఆధార్ కార్డు వివరాలు ఎవరైనా తమకు ఇస్తే.. రూ. 25 చెల్లిస్తామని హైదరాబాద్‌లోని మాదాపూర్‌కు చెందిన ఓ కన్సల్టెన్సీ నిర్వాహకుడు తెలిపారు. అంతర్జాతీయంగా ఒక వ్యక్తి పర్సనల్ డాటా విలువ 102 డాలర్ల వరకు ఉంటుందని లింక్డిన్ గణాంకాల్లో వెల్లడైంది. ఈ లెక్కన.. ఒకవేళ 'అభయహస్తం' దరఖాస్తుల్లోని మొత్తం డాటా లీకైనట్టు తేలితే దాని విలువ అంతర్జాతీయంగా వేల కోట్లలో ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

- అభయహస్తం పథకానికి వచ్చిన దరఖాస్తులు -1.25 కోట్లు
- ఒక వ్యక్తి ఫోన్ నంబర్‌కు హైదరాబాద్‌లో కన్సల్టెన్సీలు చెల్లిస్తున్న మొత్తం – రూ. 25
- ఈ లెక్కన 1.25 కోట్ల దరఖాస్తుల విలువ- రూ. 31.25 కోట్లు
- లింక్డిన్ గణాంకాల ప్రకారం.. అంతర్జాతీయంగా ఒక వ్యక్తి డాటా విలువ -102 డాలర్లు (రూ. 8,468)
- 1.25 కోట్ల అప్లికేషన్లలోని డాటా విలువ - 127.5 కోట్ల డాలర్లు (రూ. 10,585 కోట్లు)

---

*ముంబై ఎయిర్‌పోర్టు నుంచి కస్టమ్స్ అధికారులం అని నాగోల్‌లో ఉండే ఒక మహిళకు ఫోన్ వచ్చింది. ఫెడెక్స్ కొరియర్‌లో మీ పేరుతో డ్రగ్స్ వచ్చాయని, వెంటనే ముంబై రావాలని ఫోన్ చేశారు. లేదంటే ఈ కేసు సీబీఐకి అప్పగిస్తామని బెదిరించారు. నాకు సంబంధం లేదని, చీట్ చేస్తున్నారని బాధితురాలు గట్టిగానే మాట్లాడింది. మీరు ఆగండి.. మీ పేరు ఫలానా! మీరు ఉండేది హైదరాబాద్‌లో, కావాలంటే మీ ఆధార్ కార్డ్‌ను పంపిస్తామంటూ ఆమె సెల్‌ఫోన్‌కు ఆధార్‌కార్డును పంపించారు. ఆధార్‌కార్డును చూసి షాక్ అయిన బాధితురాలు ఏదో పొరపాటు జరిగిందని, కాపాడాలని వేడుకొన్నది. రూ.20 లక్షలు డిమాండ్ చేయటంతో, భయంతో వారి బ్యాంక్ ఖాతాలకు పంపింది. ఇలాంటి ఘటనలు ప్రతి రోజు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి.*

# ఆధార్ డాటాపై ఫికర్

**ప్రజాపాలన లబ్ధిదారుల డాటా అమ్మకానికి?**

- తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- ప్రస్తుతం అన్ని అవసరాలకు ఆధారం అదే
- సైబర్ నేరగాళ్లకు చిక్కితే సామాన్యుడే బలి
- గతంలో 67 కోట్ల మంది డాటా అంగట్లో
- బట్టబయలు చేసిన తెలంగాణ పోలీసులు



హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ఆధారే అన్నింటికీ ఆధారం. సాధారణ మనిషిని ఉగ్రవాదిగా, ఉగ్రవాదిని సాధారణ పౌరుడిగా చూపించవచ్చు. నకిలీ బ్యాంకు ఖాతాలు తెరవవచ్చు. దేశ సంపదనూ దోచేయొచ్చు. అలాంటి ఆధార్‌ను ఎంత జాగ్రత్తగా చూసుకోవాలి. అయినా కొన్ని చోట్ల జరిగే అలసత్వంతో ఆధార్ వివరాలు సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతున్నాయి. దాంతో ప్రజలను మోసం చేస్తూ కోట్లు దండుకుంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా డాటా అనేది అన్ని అవసరాలకు ప్రధానం. చిరు వ్యాపారం నుంచి కార్పొరేట్ వ్యాపారం వరకు అత్యంత ప్రభావితమైందీ డాటా. డాటా చోరీపైనే గతంలో సైబరాబాద్ పోలీసులు ఢిల్లీ, ఇతర నగరాల్లో దాడులు చేసి, దేశవ్యాప్తంగా దాదాపు 70 కోట్ల మంది డాటా చోరీకి గురయ్యిందని తెలిపారు. ఈ డాటాతోనే సైబర్ నేరగాళ్లు అమాయకులకు వల వేసి వివిధ నేరాలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు మన రాష్ట్రంలో కోటి మందికిపైగా ప్రజాపాలన లబ్ధిదారుల డాటా కూడా అమ్మకానికి వెళ్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అసలుతో నకిలీ ఆధార్ తయారీ

- బ్యాంకు ఖాతాలు, సిమ్‌కార్డులకు బయోమెట్రిక్ వ్యవస్థను తీసుకొచ్చినా పకడ్బందీగా అమలు చేయడం లేదు. బినామీ ఆధార్ కార్డులను ఉపయోగించి దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. సిమ్‌కార్డులు కొంటున్నారు. సేకరించిన ఆధార్‌కార్డులోని ఫొటోలు, డాటాను తమ అవసరాలకు అనుగుణంగా మార్చుకొని, నకిలీ ఆధార్‌కార్డులను తయారు చేస్తున్నారు.
- ఈ డాటాను సేకరించి ఉగ్రవాదులు ఫొటోలను మార్చేసి ఎక్కడైనా వెళ్లేందుకు అవకాశాలుంటాయి. ఎయిర్‌పోర్టుల్లోకి సైతం ఈ నకిలీ ఆధార్‌కార్డులను ఉపయోగించి వెళ్లే చాన్స్ ఉంటుంది. ఎయిర్‌పోర్టులు, ఇతర సెక్యూరిటీ ప్రాంతాలలో వ్యక్తులకు సంబంధించిన గుర్తింపు కార్డులను ఆయా సంస్థలు అడుగుతుంటాయి. అక్కడ నకిలీ ఆధార్‌కార్డులను ఉపయోగించే ప్రమాదం లేకపోలేదు.
- ఏదైనా సంఘటన జరిగినప్పుడు దర్యాప్తు సంస్థలను పక్కదోవ పట్టించేందుకు నకిలీ ఆధార్‌కార్డులను సంఘటన స్థలంలో నేరగాళ్లు వదిలేయొచ్చు. అలా వదిలేసిన కార్డులతో అసలైన కార్డుదారుడు అనుమానితుడిగా మారుతాడు. ఏ పాపం చేయకుండానే అమాయకులు విపత్కర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది.
- నకిలీ ఆధార్ కార్డులతో బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ డెబిట్ కార్డులు కూడా తీసుకొనే అవకాశం ఉంటుంది. చాలా సంస్థలు బయోమెట్రిక్‌ను ఉపయోగిస్తున్నాయి. బయోమెట్రిక్ కోసం ఫింగర్ ప్రింట్స్ కూడా క్లోనింగ్ చేసే అవకాశాలున్నాయి. ఫలానా వ్యక్తి ఆధార్‌కార్డుతో అతని సంతకం ఉండే ఏదైనా డాక్యుమెంట్‌ను నేరగాళ్లు సేకరించి, దానిలోఉండే వేలిముద్రల ఆధారంగా నకిలీ కార్డులు తయారు చేసే అవకాశం ఉంటుంది.
- బ్యాంకు ఖాతాలు, ఈమెయిల్ ఐడీలు, సోషల్‌మీడియా ఖాతాలతోనూ ఆధార్‌కు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో లింక్‌లు ఉంటాయి. ఇలా కూడా బ్యాంకు ఖాతాలను కూడా సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసే చాన్స్ ఉన్నది.

# తప్పెవరిది? శిక్ష ఎవరికి?

మొదటిపేజీ తరువాయి...

ఎంట్రీ కోసం అక్కడికి పంపారు. కూకట్‌పల్లిలోని ధర్మేందర్ ఏజెన్సీకి 14వేల దరఖాస్తులను ఎంట్రీ చేసే బాధ్యతలు ఇచ్చారు. 80 దరఖాస్తులు ఆప్‌లోడ్ చేస్తే రూ.1000ల చొప్పున చెల్లించేందుకు ఒప్పందం చేసుకొని ఈ అభయహస్తం దరఖాస్తులు అప్పగించారు. మిగిలిన దరఖాస్తులు హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో ఎంట్రీ అవుతున్నాయి. ధర్మేందర్ ఏజెన్సీకి అమీర్‌పేటలో మరో కేంద్రం ఉంది. దీంతో కొన్ని దరఖాస్తులను ర్యాపిడో బైక్‌పై అమీర్‌పేట కేంద్రానికి తరలించారు. వాస్తవానికి డాటా ఎంట్రీ ప్రక్రియ సంబంధిత అధికారి పర్యవేక్షణలోనే జరగాలి. మరి ధర్మేందర్ ఏజెన్సీ చేస్తున్న డాటా ఎంట్రీకి పర్యవేక్షకులెవరు? తమకు ఇచ్చిన పత్రాలను ర్యాపిడో బైక్‌పై మరో కేంద్రానికి తరలించేందుకు ఆ సంస్థకు అనుమతి ఇచ్చిందెవరు? ఇవన్నీ విచారణలో తేలాల్సిన అంశాలు. ఈ ఘటనలో డిప్యూటీ కమిషనర్ నిర్లక్ష్యం, అజాగ్రత్త స్పష్టంగా కనిపిస్తున్నా.. ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదనే సందేహం వ్యక్తమవుతున్నది. దరఖాస్తు తరలింపులో ఏజెన్సీ నిర్లక్ష్యం వహించినందుకు సదరు ఏజెన్సీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు డీసీ రవీందర్‌కుమార్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. కానీ కూకట్‌పల్లి, బాలానగర్ పోలీస్ స్టేషన్లలో ఎక్కడా ఇలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలపడం గమనార్హం.

**దెబ్బకు దిగొచ్చారు**

జీహెచ్ఎంసీలో ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ ప్రక్రియ గాడిలో పడింది. అభయహస్తం దరఖాస్తులు నడిరోడ్డు మీద దర్శనమివ్వడంపై ఈ నెల 9న నమస్తే తెలంగాణ దినపత్రికలో 'రోడ్డెక్కిన ప్రజాపాలన' శీర్షికన వెలువడిన కథనంతో ఒక్కసారిగా జీహెచ్ఎంసీ యంత్రాంగం ఉలిక్కిపడింది. గడిచిన రెండు రోజులుగా కమిషనర్ రొనాల్డ్‌రోస్ వరుసగా జోనల్ కమిషనర్లతో సమీక్షలు జరుపుతూ లోపాలను సరిదిద్దుతూ డాటా ఎంట్రీని గాడిలో పెట్టారు. ఒక్క దరఖాస్తు కూడా బయటకు వెళ్లకుండా మున్సిపల్ పరిధిలోనే డాటా ఆపరేటర్లపై పర్యవేక్షణ పెట్టి దరఖాస్తుల వివరాలను కంప్యూటీకరిస్తున్నారు. రొనాల్డ్‌రోస్ తొలిరోజు ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలోని డాటా ఎంట్రీ సెంటర్లను, బుధవారం సికింద్రాబాద్ జోన్‌లో బేగంపేట, సికింద్రాబాద్ సర్కిళ్లకు సంబంధించిన దరఖాస్తుల డాటా ఎంట్రీ సెంటర్‌లను పరిశీలించారు. జోనల్ కమిషనర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహిస్తున్నారు.

### అక్కడో నీతి.. ఇక్కడో రీతి..

హయత్‌నగర్ ఘటనలో టీం లీడర్‌పై వేటువేసిన ఉన్నతాధికారులు.. ఇదేరీతిన కుత్బుల్లాపూర్‌లో జరిగిన విషయంలో మాత్రం టీం లీడర్‌కు నోటీసు ఇచ్చి సరిపెట్టడం కూడా యంత్రాంగాన్ని విస్మయానికి గురి చేస్తున్నది. కుత్బుల్లాపూర్ కార్యాలయం నుంచి డాటా ఎంట్రీ ఆపరేటర్లకు దరఖాస్తులను ఫలహారంలా పంపిణీ చేసినా.. అక్కడ అధికారులపై చర్యలు తీసుకోకపోగా, టీం లీడర్ భార్గవ నారాయణకు నోటీసు మాత్రమే ఇచ్చారు. బాలానగర్ ఫ్లైఓవర్ ఘటనపై విచారణ జరిపిన అధికారి డీసీ నిర్లక్ష్యాన్ని తన నివేదికలో ప్రస్తావించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కానీ ఉన్నతాధికారులు ఈ వాస్తవాన్ని పరిగణలోనికి తీసుకోకపోవడం, కుత్బుల్లాపూర్ విషయంలో భిన్నంగా చర్యలు తీసుకోవడంపై జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆగ్రహం వ్యక్తంచేస్తున్నది. చర్యల విషయంలో అందరికీ ఒకే రూల్‌ను వర్తింపజేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### ఒక్కొక్క డేటా సెంటర్‌కు ఒక టీమ్ లీడర్‌కు బాధ్యతలు

ప్రజా పాలన కార్యక్రమంలో గ్రేటర్‌లో మొత్తం 24,74,325 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఐదు హామీలకు సంబంధించిన అభయహస్తం అప్లికేషన్లు 19 లక్షలకుపైగా ఉండగా మిగిలిన 5.73 లక్షల అప్లికేషన్లు రేషన్ కార్డు, ఇతర సమస్యలపై వచ్చాయి. అభయహస్తం దరఖాస్తులన్నింటినీ ఈ నెల 17వ తేదీలోగా అప్‌లోడ్ చేసేలా ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు 7 లక్షల దరఖాస్తులలోని డాటా ఎంట్రీని పూర్తిచేశారు. ఒక్కొక్క డాటా సెంటర్‌కు ఒక టీమ్ లీడర్‌ను నియమించారు. సర్కిల్ వారీగా ఎక్కడివి అక్కడ డాటా ఎంట్రీ చేస్తున్నారు.

---



బుధవారంనాడు వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

# దళితబంధు నిధులు ఎందుకివ్వరు?

**కలెక్టరేట్ల ఎదుట లబ్ధిదారుల ధర్నా**

వికారాబాద్, మహబూబ్‌నగర్/వనపర్తి, జనవరి 10 : దళితబంధు రెండో విడతలో ఎంపికైన వారికి వెంటనే నిధులు విడుదల చేయాలని పలు జిల్లాల్లో బుధవారం ఆందోళనలు నిర్వహించారు. వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట దళితబంధు సాధన సమితి, దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఇందులో దాదాపు వెయ్యి మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాగా మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట మహ్మదాబాద్, గండీడ్ మండలాలకు చెందిన లబ్ధిదారులు, వనపర్తి కలెక్టరేట్ వద్ద దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దళితబంధు పథకం అమలు ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. దళితబంధును కొనసాగించి ఎంపికైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని కోరారు.

# రోడ్డెక్కిన 'గృహలక్ష్మి' లబ్ధిదారులు



జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్రొసీడింగ్ కాపీలతో ధర్నా చేస్తున్న గృహలక్ష్మి లబ్ధిదారులు

**తహసీల్ ఆఫీసుల ఎదుట ఆందోళన**

కమ్మర్‌పల్లి/జగిత్యాల కలెక్టరేట్, జనవరి 10: కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన గృహలక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ సర్కారు రద్దు చేయడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. అప్పట్లో తమకు ఇచ్చిన ప్రొసీడింగ్ కాపీల ప్రకారం ఇల్లు వస్తుందా? రాదా? అన్న ఉత్కంఠ నెలకొన్నది. ఈ నేపథ్యంలోనే 'గృహలక్ష్మి' లబ్ధిదారులు బుధవారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్, వేల్పూర్ తహసీల్ కార్యాలయాల ఎదుట ఆందోళనకు దిగారు. కాగా జగిత్యాల కలెక్టరేట్ ఎదుట జగిత్యాల నియోజకవర్గంలోని వివిధ మండలాల లబ్ధిదారులు ధర్నా చేశారు. తమకు మంజూరైన ఇండ్లను రద్దు చేయొద్దని విన్నవించారు. ఒకవేళ ఇందిరమ్మ ఇండ్ల పథకం తీసుకొస్తే తమకే తొలి ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు.



భువనగిరిలో గొల్ల కురుమల ర్యాలీలో పాల్గొన్న దూదిమెట్ల బాలరాజుయాదవ్

# గొల్లకురుమలకు సబ్సిడీ గొర్రెలు ఇవ్వాలి

**దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్ డిమాండ్**

యాదాద్రి భువనగిరి, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : గొల్లకురుమల కోసం తీసుకొచ్చిన గొర్రెల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని తెలంగాణ గోట్స్ అండ్ షీప్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం గొర్రె మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి పట్టణం నుంచి కలెక్టరేట్ వరకు ఒగ్గు కళాకారుల డోలు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ హన్మంతు జెండగేకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 వేల మంది రూ.43,750 చొప్పున డీడీలు కట్టారని, వారందరికీ వెంటనే డబ్బులు చెల్లించాలని, లేదా గొర్రెలైనా పంపిణీ చేయాలని కోరారు.

## కౌలురైతు ఆత్మహత్య



భీంపూర్, జనవరి 10: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడిపెల్లి రమేశ్ (50) పన్నెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నాడు. పెట్టుబడికి 5 లక్షలు అప్పు చేశాడు. దిగుబడి వచ్చే పరిస్థితి లేక మనస్తాపానికి గురయ్యాడు. ఆయన భార్య దేవమ్మ, కొడుకు వెంకటస్వామి, కోడలు బుధవారం పత్తి ఏరడానికి వెళ్లారు. ఏరిన దూదిని ఇంటికి తీసుకెళ్లడానికి రమేశ్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. పక్కింటి వారికి ఫోన్ చేసి రమేశ్‌ను రమ్మని చెప్పారు. పక్కింటి వారు ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకొని విగత జీవిగా వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకొని బోరున విలపించారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నాడని వారు తెలిపారు.

# సోనియా పేరుతో అభయహస్తం!

- కొడుకులుగా రేవంత్‌రెడ్డి, భట్టి, ఉత్తమ్, పొన్నం
- కూతురిగా కొండా సురేఖ, అల్లుడిగా శ్రీధర్‌బాబు
- మొన్న శివుడి పేరుతో 5 గ్యారెంటీలకు అప్లికేషన్
- అభయహస్తం దరఖాస్తుల్లో చిత్ర విచిత్రాలు



హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన దరఖాస్తులో శివుడి పేరుతో దరఖాస్తు చేసిన ఘటన మరువకముందే.. తాజాగా సోనియాగాంధీ పేరిట ఓ ఆకతాయి నింపిన అభయహస్తం ఫారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. దరఖాస్తుదారు సోనియాగాంధీ, కొడుకులుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కూతురుగా కొండా సురేఖ, అల్లుడిగా మంత్రి శ్రీధర్‌బాబు పేరుతో దరఖాస్తును నింపారు. ఈ దరఖాస్తు నెట్టింట్లో వైరల్‌గా మారింది. ఇది ఓ ఆకతాయి చేసిన పనేనని, దరఖాస్తు సంఖ్య లేకుండా ఖాళీ దరఖాస్తు ఫారంలో వివరాలు నింపి 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసినట్టు నెటిజన్లు తేల్చారు. కాగా, ఇటీవల దరఖాస్తు ఫారంలో విచిత్రాలు చర్చకు దారితీస్తున్నాయి. కొందరు అప్లికేషన్ ఫామ్‌లో వ్యక్తిగత వివరాలు నింపేటప్పుడు.. వృత్తి అనగానే ఖాళీ దగ్గర 'ఇంటి కాడనే ఉంటది' అని, గృహ వినియోగ విద్యుత్తు మీటర్ కనెక్షన్ సంఖ్య అనే కాలమ్ దగ్గర 'దొరకలేదు' అని విచిత్ర సమాధానాలతో ఫామ్ నింపారు. ఈ దరఖాస్తు ఫారాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.


ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో సమ్మె చేస్తున్న ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు

# కొత్త రవాణా చట్టంపై ఆగ్రహం

**హిట్ అండ్ రన్ రూల్స్‌పై డ్రైవర్ల ఆందోళన**

ఆదిలాబాద్ రూరల్, జనవరి 10: కేంద్రం కొత్తగా తెచ్చిన రవాణా చట్టానికి (హిట్ అండ్ రన్ రూల్స్) వ్యతిరేకంగా ఆదిలాబాద్ జిల్లాలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో అద్దె బస్సుల డ్రైవర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బస్సుల సేవలను నిలిపివేసి డ్రైవర్లు ఆందోళన బాటపట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సత్వరమే నిబంధనలను రద్దు చేయాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాయికుమార్ హెచ్చరించారు.

# 'ప్రజాపాలన' పేరుతో సైబర్ మోసాలు

- దరఖాస్తుల్లో తప్పులంటూ ఫోన్లు
- మహిళలను రంగంలోకి దింపి వల
- ఓటీపీ అడిగి ఖాతా నుంచి రూ.10 వేల దోపిడీ
- నిజామాబాద్ జిల్లాలో మోసం

నిజామాబాద్ క్రైం, జనవరి 10: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. 'ప్రజాపాలన' దరఖాస్తుల్లో తప్పులు ఉన్నాయంటూ లబ్ధిదారులకు ఫోన్ చేసి బ్యాంకు ఖాతాలు కొల్లగొడుతున్నారు. ఇటీవల ఓ మహిళకు కాల్ చేసి ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు నొక్కేశారు. నిజామాబాద్ జిల్లాలో జరిగిన ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 'ప్రజాపాలన'లో డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన లావణ్య దరఖాస్తు చేసుకున్నారు. ఆమెకు ఈ నెల 3న గుర్తు తెలియని మహిళ ఫోన్ చేసి.. 'ప్రజాపాలనలో మీరు చేసుకున్న దరఖాస్తును పరిశీలిస్తున్నాం. రేషన్‌కార్డులో తప్పులు ఉన్నాయి. వాటిని సరిచేయాలంటే మీ ఫోన్‌కు ఓటీపీ పంపిస్తున్నాం. అది చెప్పాలి' అని సూచించింది. ఇది నిజమేనని నమ్మిన లావణ్య ఓటీపీ చెప్పగానే.. డిచ్‌పల్లి ఎస్‌బీఐలో గల ఆమె ఖాతా నుంచి రూ.10 వేలు డ్రా చేసినట్టు మెస్సేజ్ వచ్చింది. మోసపోయానని గుర్తించి బాధిత మహిళ హుటాహుటిన బ్యాంకుకు వెళ్లి ఖాతాలో ఉన్న మిగతా డబ్బును డ్రా చేసుకున్నది. ఇదే తరహాలో నిజామాబాద్ నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన మరో మహిళకు అదే రోజు ఓ అపరిచితురాలు మూడుసార్లు కాల్ చేసింది. మొదటిసారి ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి.. 'ప్రజాపాలనలో మీరు దరఖాస్తు చేసుకున్నారు కదా.. మీ వివరాలు చెప్పండి' అంటూ మాటల్లో పెట్టేందుకు యత్నించింది. సైబర్ నేరాలపై కొంత అవగాహన ఉన్న సదరు మహిళ ఫోన్ కట్ చేసింది. ఐదు నిమిషాల తర్వాత మళ్లీ కాల్ చేయగా కట్ చేసింది. మూడోసారి కూడా ఫోన్ రావడంతో సదరు మహిళ గట్టిగా నిలదీసింది. 'అసలు ఎవరు మీరు.. ఎందుకు వివరాలు అడుగుతున్నారు' అని ప్రశ్నించడంతో అటువైపు నుంచి కాల్ కట్ అయింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి బ్యాంక్ ఖాతాలోని డబ్బులు కాజేసేందుకు సైబర్ మోసగాళ్లు పక్కా ప్లాన్ వేశారు. దరఖాస్తు చేసుకున్న వారిలో సుమారు 90 శాతం మంది మహిళలు ఉండటంతో వారిని సులువుగా మోసం చేయొచ్చనే ఉద్దేశంతో మహిళలను రంగంలోకి దింపారు. సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు కోల్పోయిన ఘటనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దరఖాస్తుదారులు జాగ్రత్తగా ఉండాలని, ఎవరు అడిగినా ఓటీపీ చెప్పవద్దని అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు.


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి

# మా మేడం వచ్చేదాక చెక్కులు ఇవ్వొద్దు!

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వచ్చేవరకు నేతల అడ్డగింత
- గంటన్నరపాటు వేచిచూసి వెళ్లిపోయిన ఎమ్మెల్యే చింతా

సంగారెడ్డి, జనవరి 10 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డిలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయకుండా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను బుధవారం కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. 'కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎలా పంపిణీ చేస్తారు? కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మలారెడ్డి వచ్చేవరకు చెక్కులు పంపిణీ చేయొద్దు. మా మేడం వచ్చిన తర్వాతే లబ్ధిదారులకు చెక్కులు అందజేయాలి' అని కాంగ్రెస్ శ్రేణులు పట్టుబట్టారు. దీంతో గంటన్నరపాటు వేదికపైనే ఉన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్.. తాను రెండు చెక్కులు పంపిణీ చేస్తానని, ఆ తర్వాత కాంగ్రెస్ నేతలతో పంపిణీ చేయించాలని అధికారులకు సూచించారు. ఇందుకు స్పందన లేకపోవడంతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చెక్కులు పంపిణీ చేయకుండానే వెనుదిరిగి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలారెడ్డి వచ్చి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చెక్కులు పంపిణీ చేయాల్సి ఉండగా.. ఎలాంటి ప్రొటోకాల్ లేని నిర్మలారెడ్డి ఏ హోదాలో చెక్కులు పంపిణీ చేస్తారని సంగారెడ్డి బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగారెడ్డి జిల్లాలో తరచూ ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని, అయినా.. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.